నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | అక్టోబర్ 17, 2024 | www.navatelangana.com

కల్లు దుకాణంపై పోలీసుల దాడి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని సూరాయిపల్లి గ్రామంలో నిషేధిత అల్ప్రాజోలం పట్టుకున్నట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని సూరాయిపల్లి గ్రామంలో రమేష్ గౌడ్ అనే వ్యక్తి రసాయన పదార్థాలతో కల్తీకల్లు తయారు చేస్తున్నారని స్థానిక లింగంపేట్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే లింగంపేట ఎస్సై పబ్బ అరుణ్ కుమార్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని మహేశ్వరి రమేష్‌గౌడ్‌కు చెందిన కల్లు దుకాణంలోకి వెళ్లి గదిలో తనిఖీలు నిర్వహించారు. ఒక ప్యాకెట్ 30 గ్రాముల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకుని రమేష్ గౌడ్‌ను అదుపులో తీసుకొని విచారించారు. నాగిరెడ్డిపేట మండలంలోని రామక్కపల్లి తన బామ్మర్ది కాలాలి సత్యనారాయణ దగ్గర నుండి తీసుకొని వచ్చి దానితో కల్లు తయారుచేసి ప్రజలకు అమ్ముతున్నట్టు తెలిపాడు. సత్యనారాయణ నుండి 20 గ్రాముల ఆల్ప్రాజం ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరి నుంచి 50 గ్రాముల నిషేధ అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చాకచక్యంగా అల్ప్రాజోలంను పట్టుకున్న ఎస్ఐ అరుణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్, భైరప్రసాద్, సంపత్, రమేష్, రామస్వామి సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

కార్మికుల నుంచి దేశాయి బీడీ కంపెనీ డబ్బులు వసూలు

- సీఐటీయూ ఆధ్వర్యంలో కంపెనీ ముట్టడి
- రెండు గంటల పాటు కార్మికులతో భారీ ధర్నా
- దిగివచ్చిన యాజమాన్యం



మాట్లాడుతున్న ఎస్పీ రమ

నవతెలంగాణ-కామారెడ్డి

దేశాయి బీడీ కంపెనీ యాజమాన్యం కార్మికుల నుంచి సంవత్సరానికి రూ.20 కోట్లను వసూలు చేస్తున్నందుకు నిరసనగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్‌లో గల దేశాయ్ బీడీ కంపెనీ ముందు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గంటలపాటు జరిగిన ఆందోళనతో యాజమాన్యం దిగవచ్చి చర్చలకు పిలిచింది.

వివరాలు మెయిన్‌లో..



మహాసభలో పాల్గొన్న ఐద్వా ప్రతినిధులు

మహిళలకు రక్షణ కరువు


- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లైంగికదాడులను అరికట్టాలి
- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్
- ఘనంగా ఐద్వా 4వ జిల్లా మహాసభ



ఐద్వా జెండాను ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశంలో, రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే మహిళలపై లైంగికదాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని నాందేవ్‌వాడలో గల సీపీఐ(ఎం) కార్యాలయంలో ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) 4వ జిల్లా మహాసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వెంకట్రాములు, నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో మహిళలు అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తున్న ఈ సందర్భంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారికి రక్షణ కల్పించకపోగా అవమాన పరుస్తున్నాయని తెలిపారు. దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టే విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. బిల్కిస్ బానో కేసు విషయంలో నిందితులను విడుదల చేయించడమే అందుకు ఉదాహరణ అన్నారు. వారిని విడుదల చేయడమే కాకుండా సన్మానాలు చేశారని విమర్శించారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలో, దేశంలో అనేకమంది మహిళలపై హత్యలు, హత్యాచారాలు దాడులకు వ్యతిరేకంగా నిరంతరం మహిళల సమస్యలపై పోరాటం చేస్తూ ఐద్వా ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. రానున్న కాలంలో కూడా నిరంతరం పోరాటాలు చేస్తూ మహిళలకు అండగా మేమున్నామంటూ ప్రతి సమస్యపైన స్పందిస్తూ మహిళా చైతన్యం కోసం పోరాటాలు నిర్వహించే విధంగా ఉండాలని వారు అన్నారు. అనంతరం సభను ఉద్దేశిస్తూ జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. జిల్లాలో మహిళల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఆందోళనలు చేపడుతున్నామని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. అదేవిధంగా జిల్లా అధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ.. మహిళలకు ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు జరిగే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిర్పలింగం మహిళా సమస్యలను అద్దం పట్టేలా పాటలు పాడి మహాసభను ఉత్సాహపరిచారు.



పెచ్చులూడిన ఎంపీడీఓ కార్యాలయం

విధులు నిర్వహించాలంటే
భయంభయం

- పెచ్చులూడుతున్న ఎంపీడీఓ కార్యాలయం
- పట్టించుకునే నాథుడే కరువు

నవతెలంగాణ-వర్ని

మండల కేంద్రంలోని మండల అభివృద్ధి కార్యాలయంలోని ఉద్యోగులు విధులు నిర్వహించాలంటే భయపడుతున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలోని ప్రతి గది పైస్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో విధులు నిర్వహణలో ఉద్యోగులు పనిచేయాలంటే భయంతో ఓ మూలాన కూర్చుండి పనిచేయాల్సిన దుస్థితి నెలకొంది.

1990లో నిర్మాణం..

వర్ని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయాన్ని నిర్మించి 34 ఏండ్లు గడుస్తుంది. అప్పటి నుంచి ఈ కార్యాలయానికి నామమాత్రంగా మరమ్మతులు చేపడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా నామమాత్రంగానే మరమ్మతులు చేయటంతో మళ్ళీ స్లాబ్ పైకప్పులు ఊడిపోతోంది. కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు, ప్రజలు గదులలో కూర్చోడానికి భయపడుతున్నారు.

సమావేశం గది మరింత భయం..

ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించే గది పూర్తిగా పెచ్చులు ఊడి ఉండటంతో మరింత భయం నెలకొంది. సమావేశపు గదిలో ఉద్యోగుల చూపు పైకే ఉంటుందని, భయందోళన మధ్య సమావేశంలో పాల్గొంటున్నట్టు తెలుస్తోంది. ఈ కార్యాలయానికి ప్రజాప్రతినిధులు, అధికారులు వస్తారు.. పోతారు తప్పా కార్యాలయం గురించి పట్టించుకునే నాథుడే లేరని ఉద్యోగుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జనావాసాల్లోకి భారీ మొసలి



- భయాందోళనకు గురైన గ్రామస్తులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళరాంపూర్ గ్రామంలో జనావాసాల్లోకి భారీ మొసలి రావడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని రామాలయం వెనుక వైపు చెరువు నుంచి మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మొసలి జనావాసాల్లోకి వచ్చింది. గమనించిన స్థానికులు 100కు డయల్ చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారులు అక్కడి వచ్చేలోపు మొసలి మళ్లీ చెరువు వైపు వెళ్ళి కనబడకుండా పోయింది. కాగా చెరువులో మొత్తం మూడు మొసళ్లు ఉన్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు, పోలీసులు గ్రామస్థులకు సూచించారు.



రోడ్డుకు సమీపంలో మొసలి

చారులో మొత్తం నీరే.. పప్పే లేదు..

- సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆగ్రహం
- నిజాంసాగర్ మండలంలో ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నవతెలంగాణ-నిజాంసాగర్

చారులో మొత్తం నీరే ఉంది.. పప్పే లేదని సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని బుధవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో చారు మొత్తం నీలచారుగా ఉందని కనీసం అందులో పప్పు కూడా సరిగాలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వివిధ శాఖల అధికారులతో శాఖ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ల్యాండ్ రెగ్యులేషన్ స్కీం కింద ఎన్ని దరఖాస్తులు వచ్చాయని వాటిలో ఎన్ని సర్వే చేసి ఎన్ని అప్రూవల్ ఇచ్చారని, రెవెన్యూ శాఖ, ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా మొత్తం 30 ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ రాగా వాటిలో నుంచి 20 సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక పంపామని ఇంకా పది అప్లికేషన్లను పరిశీలిస్తున్నామని తహసీల్దార్ భిక్షపతి తెలిపారు. దళిత బంధు లబ్ధిదారులను కలిసి దళిత బంధు కింద మంజూరు చేసిన యూనిట్లను ఆమె పరిశీలించారు. లబ్దిదారులతో మాట్లాడుతూ.. దళిత బంధు మంజూరు చేసినప్పుడు ఎవరైనా కమీషన్లకు పాల్పడ్డారా అని ఆమె తెలుసుకున్నారు. అలాగే నిజాంసాగర్ ప్రాజెక్టును పరిశీలించి ప్రాజెక్ట్ పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టును టూరిజం దిశగా మార్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని త్వరలోనే నిజాంసాగర్ ప్రాజెక్టు టూరిజం కాబోతుందని ఆమె అన్నారు. సర్వే నంబర్ 121లో గోల్ బంగ్లా దగ్గర గల నాలుగు ఎకరాల భూమిని ఆమె పరిశీలించారు. ఆమె వెంట నిజాంసాగర్ ఎమ్మార్వో భిక్షపతి, మండల పంచాయతీ అధికారి అనిత, ఇరిగేషన్ శాఖ ఏఈఈ శివ, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సర్వేయర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నయాకులు

జమిలి ఎన్నికలు ఫెడరలిజానికి గొడ్డలివేటు

- రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న మోడీ
- రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయకుంటే పోరు
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-వర్ని(రుద్రూర్)

కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలు ఫెడరలిజానికి గొడ్డలి వేటు అని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు విమర్శించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయకుంటే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. బుధవారం రుద్రూర్ మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ(ఎం) ఏరియా 2వ మహాసభను లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా బస్టాండ్ చౌరస్తా వద్ద పార్టీ నాయకులు నాగనాథ్ జెండాను ఆవిష్కరణ చేశారు. సీపీఐ(ఎం) జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సభలో రమేష్ బాబు మాట్లాడుతూ.. జమిలి ఎన్నికల పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తు పెత్తనం చేయటం తగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకొని పోరు చేస్తామని హెచ్చరించారు. ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మూడేండ్ల కాలంలో చేసిన పోరాటాలు, ఉద్యమాల నివేదికను ప్రవేశ పెట్టారు. సభ్యులు నివేదికలో ఉన్న వాటిపై భవిష్యత్తులో చేసే పోరాటాలను, ఉద్యమాలపై చర్చలు చేశారు. ఈ సందర్భంగా సభ్యులు వారి అభిప్రాయాలను తెలిపారు. పార్టీ చేసే పోరాటంలో భాగస్వాములు కావాలని, పార్టీని బలోపేతం చేయటంలో కార్యకర్తలు మరింత ముందుకు పోవాలని శంకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మహాసభలో గంగాధర్, సాయగౌడ్, రాములు, సాయిబాబా, లక్ష్మణ్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులను అడ్డుకునేందుకు
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి

- ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలి
- ఐఎంఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దామోదర్‌రావు, శ్రీశైలం



మాట్లాడుతున్న ఐఎంఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో పనిచేస్తున్న వైద్యులపై దాడులను అడ్డుకునేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి, ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని ఐఎంఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వైద్యులు దామోదర్‌రావు, కొట్టూరు శ్రీశైలం కోరారు. నగరంలోని ఖలీల్‌వాడిలో గల ఇందూర్ న్యూరో సైకియాట్రిస్టిక్ ఆస్పత్రిలో ఐఎంఏ జాతీయ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపులో భాగంగా ఇండియన్ మెడికల్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో కలకత్తాలో అమ్మానుష్య దాడిలో ప్రాణాలు కోల్పోయిన పీజీ వైద్యురాలికి న్యాయం జరగాలని కోరుతూ జూనియర్ డాక్టర్ల న్యాయమైన పోరాటానికి సంఘీభావం తెలిపి నల్ల బ్యాడ్జీలు ధరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొద్ది రోజులుగా పశ్చిమబెంగాల్లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ డాక్టర్లు న్యాయమైన పోరాటానికి ఐఎంఏ నిజామాబాద్ వైద్యుల పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ప్రభుత్వాలు వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డాక్టర్ విశాల్, డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, డాక్టర్ జీవన్రావు, డాక్టర్ బోద్దుల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను వంచించిన
రేవంత్ సర్కార్

- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ-కంఠేశ్వర్

రేవంత్‌రెడ్డి సర్కార్ మాదిగ జాతిని వంచిందని, నమ్మకద్రోహానికి గురైన మాదిగలు తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ఎక్కే పరిస్థితి నెలకొంటుందని, ఎస్సీ వర్గీకరణ అమలు చేయకపోతే మరో పోరాటం తప్పదని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు, వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ అనుబంధ సంఘాల తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నగరంలోని శ్రావ్యగార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రాలు అమలు చేసుకోవచ్చని ఆదేశాలు జారీ చేసిందని అయినా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గే, తెలంగాణలోని మాలల ఒత్తిడితో రేవంత్‌రెడ్డి సర్కార్ ఎస్సీ వర్గీకరణను తొక్కి పెట్టేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభలో ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తూ మాదిగలకు న్యాయం చేస్తామని చెప్పి గతంలో ఇచ్చిన ఉద్యోగాలలో సైతం వర్గీకరణ లేకుండా ఉద్యోగుల భర్తీ చేస్తామని చేయకుండా మాటతప్పారని మండిపడ్డారు. అడ్మిషన్ ప్రక్రియ సైతం చేస్తూ మాదిగలకు పూర్తిగా అన్యాయం చేయడాన్ని ఖండించారు. ఎన్నికల సమయంలో వికలాంగులకు రూ.3000 నుంచి 6000 వరకు పెన్షన్ ఇస్తామని చెప్పి అదేవిధంగా వృద్ధులకు వితంతులకు పెన్షన్ కూడా పెంచకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ కోసం స్వయంగా అన్ని పోరాటాలలో ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని అందరినీ నమ్మించారని ఇప్పుడు ఇలా చేయడాన్ని తప్పుపట్టారు. ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ జాతి మరో పోరాటాలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. మాదిగలను అవమానించిన వారికి భారీ మూల్యం తప్పదని తెలంగాణలో రేవంత్ సర్కారుకు నిద్ర పట్టకుండా చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అదేవిధంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో ఉన్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి అసెంబ్లీలో తీసుకువెళ్లి పరిష్కార దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 సంవత్సరాల పోరాటాల చరిత్ర ఆయనకే సొంతమని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సరికెల పోశెట్టి, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు ప్రమోద్ మాదిగ, విహెచ్పిఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి, ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు మైలారం బాలు, మాదిగ ఉద్యోగస్తుల జాతీయ నాయకులు తెడ్డు గంగారాం మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ మాదిగ, జిల్లా మాదిగ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మైలారం గంగాధర్ మారుతి, గద్దల రమేష్, సూరజ్, లక్ష్మీ గారి భూమయ్య, మహేష్ మాదిగ, ప్రవీణ్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ భిక్ష కాదు.. హక్కు

- కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం




దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ భిక్ష కాదు హక్కు అని, కాంగ్రెస్ సర్కార్ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని న్యూబాయ్స్ హాస్టల్ ముందు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా విద్యరంగాన్ని పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. అదేవిధంగా 3 సంవత్సరాల కాలం నుంచి విడుదల కావలసిన రూ.8142 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఒక పక్క ప్రైవేట్ డిగ్రీ యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక కళాశాలలను బంద్ పెడుతున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల విద్యార్థి లోకానికి తీవ్ర అన్యాయం జరిగే పరిస్థితి నెలకొందన్నారు. మరో పక్క గ్రూపు -1 మెయిన్స్, ఇతర కాంపిటీటివ్ పరీక్షలు ఉనందున్న ప్రభుత్వం మొండిగా పోకుండా ప్రైవేట్ డిగ్రీ యాజమాన్యాలతో చర్చించి సమస్యను పరిష్కరించాలని లేకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్, చక్రి, జీశన్, అశోక్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల పక్షాన నిలబడిన ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబా



నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

నవతెలంగాణ-బోధన్

ప్రొఫెసర్ సాయిబాబా తాను జీవితాంతం పీడిత ప్రజల పక్షాన నిలబడి పోరాడారని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో హక్కుల కార్యకర్త, ప్రొఫెసర్ జీఎన్.సాయిబాబాకు మానవ హక్కుల వేదిక నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, వామపక్ష పార్టీల నాయకులు ఘనంగా బుధవారం నివాళులర్పించారు. అనంతరం మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు గడ్డం గంగులు మాట్లాడుతూ.. ప్రొఫెసర్ సాయిబాబా తను జీవితాంతం పీడిత ప్రజల పక్షాన నిలబడి పోరాడినారన్నారు. అణగారిన వర్గాల ప్రజల గొంతుకగా సాయిబాబా పని చేయడం పాలకవర్గ పార్టీలకు గిట్టలేదని అన్నారు. సాయిబాబా అసమానతలు లేని మానవీయ సమాజం కోసం, ఉన్నత విలువల కోసం పరితపించాడని పేర్కొన్నారు. అక్రమంగా తప్పుడు ఆరోపణలు చేసి కేసులు బనాయించి సుమారు 10 సంవత్సరాలు జైలు శిక్ష వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 90 శాతం దివ్యాంగుడైన సాయిబాబా పట్ల కేంద్ర ప్రభుత్వం, మహారాష్ట్ర ప్రభుత్వం క్రూరంగా వ్యవహరించాయని ఆందోళన వ్యక్తం చేశారు. చివరికి సుప్రీం కోర్టు సాయిబాబాపై పెట్టిన అక్రమ కేసులను కొట్టి వేసిందని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడం రివాజుగా మారిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా మేధావులను, హక్కుల కార్యకర్తలను అక్రమ కేసుల్లో ఇరికించి ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తుందన్నారు. సాయిబాబా జీవితం పోరాడే వ్యక్తులకు ఆదర్శప్రాయమని తెలియజేశారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడడమే సాయిబాబాకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. ఆదివాసీ హక్కుల కోసం సంఘటిత పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్ చర్యలు వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు పి.వరదయ్య, అహ్మద్, గౌతం కుమార్, గంగాధర్ అప్పా, గౌస్, సురేష్, మోసీం, పోశెట్టి, సాయికుమార్ లక్ష్మణ్ గౌడ్, నాగరాజు, ఖురేషీ, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు


మాట్లాడుతున్న డాక్టర్ గౌతమ్‌రాజు

నవతెలంగాణ-బాల్కొండ

పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలో బుధవారం ఉచిత గాలికుంటూ నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని నడిమిగల్లి, ఆర్మూర్ గల్లిలోని 240 పశువులకు (ఆవులు, గేదెలు) ఉచిత గాలికుంటు టీకాలు వేశామని డాక్టర్ గౌతమ్ రాజు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పోచమ్మగల్లిలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య అధికారి డాక్టర్ గౌతమ్ రాజు తెలిపారు. కార్యక్రమంలో పెంటు రాజేశ్వర్, కొబ్బాయి నర్సయ్య, విడిసి సభ్యులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది ప్రణీత్, మల్లేష్, బషీర్ పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీ వితరణ



నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని తగ్గెల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఐలేశ్వర్, సాలూరకు చెందిన రాజు ఇరువురు పాఠశాల అవసరాల కొరకు 10 కుర్చీలను అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దాసరి ధన్‌రాజ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

నవతెలంగాణ-విలేకరుల బృందం

వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఈ మూడు ఘటనలు నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకున్నాయి.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఒకరు మృతి..

ఆర్మూర్ : ఆలూర్ మండలంలోని మచ్చర్ల గ్రామ శివారులో మంగళవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఒకరు మరణించారు. స్థానికుల పోలీసుల సమాచారం ప్రకారం.. మార్ల చిన్నయ్య (48) మచ్చర్ల గ్రామం నుంచి వన్నెల్ కే గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలై చిన్నయ్య అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా చనిపోయిన ఈయన మృతదేహాన్ని పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రైలు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడు మృతి..

కంఠేశ్వర్ : నిజామాబాద్ రైల్వే పరిధిలో రైలు ప్రమాదంలో గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్టు నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సాయిరెడ్డి బుధవారం తెలిపారు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని యువకుడు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉంటుంది. ఆర్మూర్ నిజామాబాద్‌ల మధ్య గల మామిడిపల్లి రైల్వే గేటు వద్ద


ఆర్మూర్: విద్యుత్ స్థంబాన్ని ఢీ కొని మృతి చెందిన చిన్నయ్య..


మాక్లూర్: బాబురావు మృతదేహం


కంఠేశ్వర్: రైలు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు

గుర్తుతెలియని గూడ్స్ రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే రైల్వేపోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సాయిరెడ్డి 8712658591, లేదా 9440899341 ఈ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొని వ్యక్తి మృతి..

మాక్లూర్ : మండలంలోని మానిక్‌బండార్ చెక్క వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం నిజామాబాద్‌లోని గౌతంనగర్‌కు చెందిన జంగంపల్లి బాబురావు (39) మేస్త్రి పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. 15-10-2024వ తేదీన ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో మాణిక్‌బండార్ చెక్క వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య జంగంపల్లి లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేతుల పరిశుభ్రత చాలా ముఖ్యం

- ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ అగర్వాల్


మాట్లాడుతున్న దంత వైద్య నిపుణులు డాక్టర్ అగర్వాల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

చేతుల పరిశుభ్రత చాలా ముఖ్యమని ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ అగర్వాల్ తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల దుబ్బలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో గ్లోబల్ హాండ్స్ వాషింగ్ డేను పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ రోజులలో ఆరోగ్యం మన దినచర్యలో భాగమైనదని రోజువారి దినచర్యలో మన స్వచ్ఛతే మనకు ఆరోగ్యాన్ని కాపాడుతుందని తెలిపారు. క్రిములు కీటకాలు అన్నది మన చేతి ద్వారా నోటిలోకి వెళ్లి అనారోగ్యం బారిన పడటానికి కారణాలు అవుతాయని అన్నారు. అందుకే చేతులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు కార్యదర్శి గంగారెడ్డి, కోశాధికారి భరత్ పటేల్, కార్యనిర్వాహణ అధికారి పార్సి రాజేశ్వర్, సభ్యులు రాజ్ కుమార్ సుబేదార్, బాబురావు, ఆకుల అశోక్, రామకృష్ణ పాఠశాల హెచ్‌ఎం గంగయ్య సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

టియుసిఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ విజయవంతం చేయాలి

- కరపత్రాలు విడుదల


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

టియుసిఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభ జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ముత్తెన్న తెలిపారు. బుధవారం మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలోని సీజే బీడీ కంపెనీ హెడ్ ఆఫీస్‌లో బీడీ ప్యాకింగ్ కార్మికులు, ఇతర రంగాల కార్మికులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. ఈనెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న విలీన సభకు ప్రజలు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు పి.మనోజ్ కుమార్, దేవదాస్, రాజేశ్వర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి పరీక్షలు

నవతెలంగాణ-బాల్కొండ

లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంగడి వద్ద గల వెంకటగిరి కాంప్లెక్స్‌లో ప్రతి గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ అధ్యక్షులు అందే వెంకటగిరి తెలిపారు. కంటి సమస్యలున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ

నవతెలంగాణ-కంఠేశ్వర్

గత 5 రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన ఓ అనాథ శవానికి (ముస్లిం మతానికి చెందిన వ్యక్తి) చనిపోవడంతో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అంత్యక్రియలు నిర్వహించామని 4వ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం నగరంలోని బాబాన్ సహాబ్ పహడి వద్ద గల అసద్ బాబ నగర్ స్మశాన వాటికలో ముస్లిం మత సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ, జామాతే ఇస్లామి అలాగే మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్, 4వ టౌన్ పోలీస్ సిబ్బంది నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ సిస్టం వినియోగం కేసులో ఒకరికి జైలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో సౌండ్ బాక్స్‌ల వినియోగం కేసులో ఒకరికి జైలు శిక్ష పడిందని ఒకటవ పోలీస్ స్టేషన్ సిఐ రఘుపతి బుధవారం తెలిపారు. సౌండ్ బాక్స్‌ల వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు ఉల్లంఘించి లైసెన్స్ లేని వ్యక్తులు సౌండ్ సిస్టంలను కిరాయికి ఇచ్చిన మోపాల్ మండలం కులాస్పూర్ గ్రామానికి చెందిన నిమ్మల వంశీని కోర్టులో ప్రవేశపెట్టగా నిమ్మల వంశీకి రెండవ క్లాస్ మెజిస్ట్రేట్ ఒక రోజు జైలు శిక్ష విధించారని సిఐ రఘుపతి తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో చింత రాజు శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేయకుండా, సత్వరమే పూర్తి చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. ఏ గ్రామంలో ఎన్ని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలు అనారోగ్యాల బారిన కాపాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ సిబ్బందితో మురికి కాలువలను శుభ్రం చేయించాలని, మురికి కాలువల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం గ్రామాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల వివరాలను, వాటి పురోగతిని కూడా ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఏకగ్రీవ కృతజ్ఞతాభినందన తీర్మానం పంపిన కాంగ్రెస్ నాయకులు


తీర్మాన కాపీని చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ బాల్కొండ మండల అధ్యక్షులు గున్నాల వెంకటేష్ గౌడ్, మండల నాయకుల ఆధ్వర్యంలో బుధవారం బాల్కొండ తపాలా కార్యాలయం ద్వారా కృతజ్ఞత అభినందనల తీర్మాన కాపీని పంపారు. 'తెలంగాణ రాష్ట్రం అవతరణ జరిగింది నీళ్లు, నిధులు, నియామకాలపైన మన కొలువులు మనకే, మన నీళ్లు మనకే అనే నినాదంతో.. కానీ గత ప్రభుత్వాలు నిరుద్యోగుల పట్ల నిరంకుశత్వంతో ఉద్యోగాల భర్తీపై కాలయాపన చేస్తూ నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అభయ హస్తం పేరిట ఆరు గ్యారంటీల భరోసాతో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం 60 రోజుల్లో డీఎస్సీ ఉద్యోగ నియామకాన్ని పూర్తి చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అన్ని వర్గాల పక్షాన ఉంటుంది. నిరుద్యోగుల పక్షాన పెద్దన్నగా నిలబడుతూ వారి బాధను చూసి ఉద్యోగాలను భర్తీ చేయాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి డిఎస్సి ఉద్యోగాలతో ఈ విజయ దుందుభి మోగించారు.' అని తీర్మాన కాపీలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఇమాన్ ఖాన్, క్యాతం కిషన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్యాల శ్రీనివాస్, బీసీ విభాగం మండల అధ్యక్షుడు మాటిగం గంగమల్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు డెస్క్‌టాప్ బహూకరణ


పలువురికి సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రభుత్వ ఉపాధ్యాయుడు తెడ్డు మోహన్ తమ గ్రామంలోని తాను చదువుకున్న యానంపల్లి ఉన్నత పాఠశాలకు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.25వేలతో కంప్యూటర్ డెస్క్ టాప్‌ను బుధవారం బహూకరించారు. కంప్యూటర్ డెస్క్ టాప్‌తో విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వారన్నారు. చదువుకున్న చోటే విద్యాబోధన చేయడం, ఇదే కాకుండా తనవంతుగా సహాయ సహకారాలు అందజేస్తుండటం మర్చిపోలేనిదని వారు పేర్కొన్నారు. పాఠశాలకు అడగకముందే సమకూర్చిన తెడ్డు మోహన్‌కు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, మాజీ ఎస్‌ఎంసి చైర్మన్ దాసరి గణేష్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అబ్బయ్య, సంతోష్, క్రాంతికుమార్, హెల్పింగ్ హాండ్స్ ట్రస్ట్ సభ్యులు ప్రతాప్, రాజు తదితరులు తెడ్డు మోహన్‌కు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. ఇంతకుముందు ఇదే పాఠశాలకు గతంలో కూడా బోరు మోటర్, బోరు వేయించిన అప్పల యెంబరి రాజు, శేరు భాస్కర్లను కూడా ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారుజ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు గ్రామంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను గ్రామస్తులు కొనియాడారు.

ఏఎంసీ చైర్మన్‌ను కలిసిన నూడ చైర్మన్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నూతనంగా నూడ చైర్మన్‌గా నియమితులైన కేశ వేణు బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీలోని మార్కెట్ కమిటీ చైర్మన్ ఛాంబర్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

బిటి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-మెండోరా

నియోజకవర్గంలోని పలు గ్రామాలలో బీటీ రోడ్ల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ 5 కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు జీవో విడుదల చేసింది. గ్రామాలలో బీటీ రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ముత్యాల సునీల్ రెడ్డికి మండల నాయకులు కతజ్ఞతలు తెలిపారు. కాగా మెండోర మండలం సావెల్ గ్రామం నుండి తడపాకల్ వెళ్లే పెద్దవాగు వరకు బిటి రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల 15 లక్షలు మంజూరయ్యాయి. పెద్దవాగులో ఏళ్ల తరబడి ఉన్న సాంబయ్య గుడి దగ్గరకు పలు ప్రాంతాల నుండి వెళ్లే భక్తులు రోడ్డు మార్గం సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొనేవారని ఎట్టకేలకు రోడ్డు నిర్మాణం మంజూరు కావడంతో భక్తులకు రాకపోకలు సులువుగా ఉంటుందని భక్తులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంతో పాటు సావెల్ గ్రామాభివద్ధికి పాటుపడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి సావెల్ గ్రామానికి 2కోట్ల 87 లక్షల రూపాయలు అభివద్ధి నిధులు మంజూరు చేయించిన సావెల్ గ్రామ ముద్దు బిడ్డ ముత్యాల సునీల్ రెడ్డి కి గ్రామ ప్రజలు కతజ్ఞతలు తెలియజేశారు.

మంచి నీటి సహాయకులకు రెండోరోజు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న సహాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గ్రామీణ మంచి నీటి సహాయకులకు 4రోజుల శిక్షణలో భాగంగా ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలోని రైతు వేదికలో రెండో రోజు శిక్షణను బుధవారం నిర్వహించారు. ఎఈఈ డిప్‌చంద్ శిక్షణను ఉద్దేశించి మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీల్లో ఉన్న గ్రామీణ మంచి నీటి సహాయకులు తమ పరిధిలో ఉన్న మోటార్ల రిపేరింగ్, వైర్లు, మెటీరియల్ ఏ రకంగా వాడాలి, నిరంతరంగా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు సూచనలు చేశారు. గ్రామాల్లో ఉన్న నీటి ట్యాంకుల్లో క్రమం తప్పకుండా క్లోరినేషన్ ఏ మోతాదులో వేయాలో తెలిపారు. ప్రజలకు అందజేసే నీటిని కలుషితం కాకుండా సమయానుసారం నీటి సరఫరా చేస్తూనే ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే దాన్ని మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఈఈ సాయిచరణ్, ఏఈ శివా, ట్రైనర్ ధనుంజయ్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్ జూనియర్ జిల్లా సాఫ్ట్‌బాల్ బాలుర జట్ల ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్

నేడు సబ్-జూనియర్ జిల్లా సాఫ్ట్ బాల్ జిల్లా బాలుర జట్టు ఎంపికను పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి.ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్యంటి గంగా మోహన్ బుధవారం తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 01-01- 2010 తర్వాత జన్మించి ఉండాలని సూచించారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 08 గంటలకు సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ ఈ నరేష్‌కు రిపోర్ట్ చేయాలని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి 3 రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష పడినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. డ్రంకన్ డ్రైవ్ కేసులో బుధవారం జిల్లా కేంద్రంలోని మార్నింగ్ కోర్టులో నలుగురు వ్యక్తులను హాజరుపర్చారు. వీరిలో ముగ్గురికి జడ్జ్ రూ.7వేల జరిమానా విధించారు. మరొకరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. మద్యం తాగి వాహనాలను నడపకూడదని వాహనదారులకు నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి నారాయణ సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

డబుల్ బెడ్ రూమ్ దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-బాల్కొండ


మండల కేంద్రంలోని రెండు పడకల గదుల (డబుల్ బెడ్ రూమ్) రెండవ విడతకు సంబంధించి కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎమ్మార్వో అప్ప శ్రీధర్ బుధవారం తెలిపారు. ఈ దరఖాస్తులను స్వీకరించడానికి గ్రామపంచాయతీ కార్యాలయంలో సిబ్బందిని నియమించినట్టు తెలిపారు. ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని అర్హులైన వారు రెండు పడకల నివాస గృహముల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రము, తదితర డాక్యుమెంట్లను జతచేసి గ్రామపంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే పేద ఎస్సీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద ఆర్థికసాయం అందిస్తుందని నిజామాబాద్ జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి నిర్మల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్ దేశాలలోని విశ్వ విద్యాలయాల్లో చదవాలనుకునేవారికి ఈ పథకం కింద స్కాలర్షిప్ అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు జీఆర్ఈ/జీఎంఎటి లేదా టిఓఎఫ్ఈఎల్/ ఐఈఎల్‌టిఎస్‌లలో అర్హత స్కోర్‌తో పాటు, డిగ్రీలో 60 శాతం మార్కులు పొంది ఉండాలని సూచించారు. విద్యార్థి కుటుంబం సంవత్సరాదాయం అన్ని విధాల రూ.5 లక్షలకు మించి ఉండకూడదని తెలిపారు. ఆదాయం సర్టిఫికేట్ మీసేవ నుండి పొందాలని, ఒక కుటుంబం నుండి ఒక విద్యార్థికి మాత్రమే స్కాలర్షిప్ ఇవ్వబడుతుందని తెలిపారు. విద్యనభ్యసించడానికి పాస్‌పోర్ట్, వీసా కలిగి ఉండాలని, అక్రిడేషన్ పొందిన విదేశీ యూనివర్సిటీ/సంస్థ నుండి అడ్మిషన్ లెటర్ పొంది ఉండాలని తెలిపారు. ఈ పథకానికి ఆన్‌లైన్ http://telanganaepass.gov.in ద్వారా నిర్ణీత ప్రొఫార్మాలో ఈనెల 29న సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిజామాబాద్ నుడా చైర్మన్‌కు సన్మానం


నుడా చైర్మన్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నుడా చైర్మన్‌గా నియమితులైన కేశ వేణును యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్, నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఉమ్మాజి నరేష్ శాలువాతో సన్మానించి పూల బొకేను అందజేశారు.

పాఠశాలలో చేరిన కొత్త టీచర్లు



నియామకపత్రం అందజేత

నవతెలంగాణ-బోధన్

డీఎస్సీలో నూతనంగా ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు బుధవారం వారికి కేటాయించిన పాఠశాలలో వెళ్లి విధులలో చేరారు. బోధన్ మండలానికి 38 మంది నూతన ఉపాధ్యాయులను కేటాయించగా వారు తొలిరోజు వారికి కేటాయించిన పాఠశాలలో విధులలో చేరారు. కల్దుర్కి జడ్పీ హైస్కూల్‌లో స్పెషల్ టీచర్ విధులలో చేరినట్లు సీఆర్పీ బాబు తెలిపారు. పాఠశాలలో చేరిన వారికి సీనియర్ ఉపాధ్యాయులు హితబోధ చేస్తున్నారు. పాఠశాల నియమ నిబంధనలు వివరించారు.

పశువైద్య శిబిరం సందర్శన



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ పి.శ్రీనివాస్

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గండివేట్ గ్రామంలో గాలికుంటు పశువైద్య శిబిరాన్ని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ పి.శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధక అధికారి సంజయ్‌కుమార్‌లు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 722 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి రవి, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు



రామారెడ్డి: వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ డైరెక్టర్



నాగిరెడ్డిపేట్‌లో..



ఎల్లారెడ్డిలో..

- పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం

ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని పలువురు సూచించారు. బుధవారం పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.

రామారెడ్డి : మండలంలోని మద్దికుంట, రెడ్డిపేట్, రెడ్డిపేట తండాలతో పాటు అన్నారం, గొడుగుమర్రి తండాల్లో మాచారెడ్డి సొసైటీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను సొసైటీ డైరెక్టర్ స్వామిగౌడ్, తోట భూమయ్యతో కలిసి చైర్మన్ పూల్ చంద్ నాయక్ ప్రారంభించారు. రైతులు దళారులు నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు వరి ధాన్యాన్ని విక్రయించి లబ్దిపొందాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు

నాగిరెడ్డిపేట్ : మండలంలోని తాండూర్, మాల్ తుమ్మెద సొసైటీల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులకు ఆశ్రయించకుండా కేవలం ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యాన్ని విక్రయించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తాండూరు సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి, మాల్తుమ్మెద సొసైటీ చైర్మన్ నరసింహులు, ఉపాధ్యక్షులు కష్ణవేణి, మిద్దె బాబురావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, డైరెక్టర్లు గుర్రాల సిద్దయ్య రవీందర్ రెడ్డి, నగేష్, మాజీ చైర్మన్ రాజిరెడ్డి, సీఈఓ జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : మండల పరిధిలోని జంగమాయిపల్లి క్లస్టర్ శివనగర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డితో కలిసి తహసిల్దార్ మహేందర్ ప్రారంభించారు. ప్రభుత్వం క్వింటాల్‌కి ఏ గ్రేడ్ ధాన్యానికి 2320, బి గ్రేడ్ ధాన్యానికి 2300 ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉషా గౌడ్, మాజీ సర్పంచ్ లక్ష్మి, పద్మారావు, సాయిలు, గంగారం, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి మండల పరిధిలోని గండి మాసానిపేట్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ ఏగుల నరసింహులు ప్రారంభించారు. కార్యక్రమంలో డిటి సురేష్, ఏఈఓ సతీష్, సొసైటీ డైరెక్టర్లు దేవదాసు, లక్ష్మణ్ నాయక్, నర్సింలు, సిబ్బంది మల్లేష్, సత్యం, ప్రభుదాస్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని విండో చైర్మన్ కోడిప్యాక తిరుపతిగౌడ్ అన్నారు. మండలంలోని ముత్యంపేట్ సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజయ్ రావు, విండో వైస్ చైర్మన్ సిద్దరాములు, డైరెక్టర్‌లు సిద్దగౌడ్, మహేందర్ గౌడ్, రైతులు ఉన్నారు.

లింగంపేట్ : గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యం వెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలించాలని లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కూచంపల్లి దేవేందర్ రెడ్డి అన్నారు. లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో లింగంపేట్, పర్మల్ల, మంబోజిపేట్, కంచుమల్, భవానీపేట్, జల్దిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తనిఖీ అధికారి రాధిక, కార్యదర్శి పెంటయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారాగౌడ్, ఆకుల సంగయ్య, ముదాం సాయిలు, వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, మనోహర్, బోయిన సాయిలు, పోశెట్టి, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

భిక్కనూర్ : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండలంలోని అంతంపల్లి, లక్ష్మీదేవునిపల్లి గ్రామాలలో సొసైటీ చైర్మన్ వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి 2320, బి.గ్రేట్ ధాన్యానికి 2300 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శివప్రసాద్, సొసైటీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, సీఈఓ శ్రీనివాస్, డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట్‌లో..

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ రాజాగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కాచాపూర్ సొసైటీ చైర్మన్ కష్ణ గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ స్వామి, వ్యవసాయ అధికారి రాధ, ఏఈఓ లతా, సొసైటీ సీఈవో మోహన్ గౌడ్, డైరెక్టర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని కాచాపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ కిష్టగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో శివ ప్రసాద్, మాజీ ఎంపీపీలు గాల్ రెడ్డి, సుదర్శన్, వ్యవసాయ అధికారి రాధ, డైరెక్టర్లు, సీఈవో, ఏఈఓ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : మండలంలోని మల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని మల్లూరు తాండ, వడ్డేపల్లి, జక్కాపూర్. అచ్చంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని అచ్చంపేట్ గ్రామంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్లు కళ్యాణి విఠల్ రెడ్డి, నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి ధాన్యాన్ని సకాలంలో రైతులు వరి కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని తెలిపారు. తేమశాతం 15 కంటే ఎక్కువగా ఉండద్దని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, అగ్రికల్చర్ ఆఫీసర్ అమర్ ప్రసాద్, సొసైటీ సీఈఓ సంగమేశ్వర్‌గౌడ్, కోటగిరి సాయిలు, సంఘ సభ్యులు, రైతులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్మన్లు అన్నారు. మండలంలోని పద్మాజివాడి పరిధిలోని మెడేగంలో, ఉత్తునూర్ పరిధిలోని యాచారం, వజ్జాపల్లి తండాలో ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను చైర్మన్లు కమలాకర్‌రావు, గంగాధర్, ప్రభాకర్ రావు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈఓలు విగ్నేష్ గౌడ్, దేవేందర్, నయీమ్, డైరెక్టర్లు, సొసైటీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో..



నిజాంసాగర్‌లో..



సదాశివనగర్‌లో..

కాంప్లెక్స్ నిర్మాణం కోసం భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా వ్యాపార సముదాయాల కొరకు నిర్మిస్తున్న కాంప్లెక్స్ నిర్మాణానికి సొసైటీ చైర్మన్ రాజా గౌడ్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీ ఆధ్వర్యంలో ఎన్‌డిసిసిబి బ్యాంకు సహకారంతో రూ.30 లక్షల నిధులతో సొసైటీ ముందు కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి ఏఈ నరేష్, సొసైటీ డైరెక్టర్లు, సీఈవో మోహన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి ఆలయానికి రావుల కుటుంబానికి సంబంధం లేదు

- ఆలయ ఈవో ప్రభు రామచంద్రం



నవతెలంగాణ-కామారెడ్డి

మాచారెడ్డి మండలం గజ్యా నాయక్ తాండ క్రాస్ రోడ్‌లో గల శ్రీ వీరహనుమాన్ వెంక టేశ్వర స్వామి దేవస్థానానికి రావుల అంతయ్య అండ్ సన్స్ కుటుంబానికి సంబంధం లేదని ఆలయ ఈవో ప్రభు రామచంద్రం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శ్రీ వీరహనుమాన్ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి రావుల అంతయ్య అండ్ సన్స్‌కు సంబంధం ఉన్నట్లు కొన్ని పత్రికలలో ప్రచురితమైందని ఈ గుడికి ఆ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఈ ఆలయానికి మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన గంధం రాజగోపాల్ రెండు ఎకరాల, 5 గుంటల భూమిని ఇచ్చారని ప్రకటనలో పేర్కొన్నారు. గంధం రాజగోపాల్ కుటుంబ సభ్యులలో ఎవరైనా తమ పూర్వీకుల పేరును శిలాఫలకాలపై పెట్టాలని కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని ఇస్తే తాము దానినిపై అధికారులకు పంపి పై అధికారుల సూచనల మేరకు నిర్ణయం తీసుకోనున్నట్టు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

అకౌంటెంట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

- జిల్లా విద్యాశాఖ అధికారి రాజు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలోని నాలుగు కేజీబీవీలలో అకౌంటెంట్ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో మహిళా అభ్యర్థుల నుంచి 2024-25 వరకు భర్తీ చేయుటకు దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. జిల్లా స్థానిక మహిళా అభ్యర్థులై ఉండి, విద్యార్హతలు కామర్స్ సబ్జెక్టులో గ్రాడ్యుయేషన్ బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ ఎంఎస్ వర్డ్, ఎక్సెల్ తదితర కోర్స్ కోర్సులు కలిగి ఉండాలని సూచించారు. బీకాం కంప్యూటర్ గలవారు పైన తెలిపిన పోస్టులకు అర్హులని దీనికి విద్యార్హత గలవారు https://deokamareddy.in/ website లో పొందుపరిచిన దరఖాస్తు నమూనాను పూరించి జిల్లా కలెక్టరేట్‌లో విద్యాశాఖ కార్యాలయం, రూమ్ నెంబర్ 223లో ఈ నెల 21, సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

కులం పేరుతో దూషించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ ఎరుకల గిరిజన హక్కుల ఐక్య పోరాట సమితి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు



మాట్లాడుతున్న కోనేరు సాయికుమార్

నవతెలంగాణ-కామారెడ్డి

కులం పేరుతో దూషించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎరుకల గిరిజన హక్కుల ఐక్య పోరాట సమితి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు కోనేరు సాయికుమార్ అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సింధు శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గాంధారి మండల కేంద్రానికి చెందిన ఎరుకల పెద్ద సాయిలు, తండ్రి ఎరుకల నరసయ్య గత 25 సంవత్సరాల క్రితం గాంధారికి వారి కుటుంబంతో సహా వచ్చారు. దేశ్ పాండ్ హనుమంతరావు వద్ద ఖరీదుకు భూ స్థలం 360 గజాలు తీసుకున్నారు. ఆ స్థలంలో మూడు గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. గత నెల 26న దిలీప్ రావు, కష్ణ గౌడ్, భాస్కర్ గౌడ్, తాటి మధుసూదన్, బేజుగం సంతోష్ వారే కాకుండా కామారెడ్డి, భిక్కనూరు నుంచి 50 మంది ఆడ, మగ గుండాలను తీసుకువచ్చి ఇంటిలో మగ వ్యక్తులు లేని సమయంలో ఇంటిపై దాడి చేశారు. ఎరుకల బుద్దవ్వ, ఎరుకల రేణుక, ఎరుకల సాయవ్వ, ఎరుకల రమేష్‌పైన బూతు మాటలు కులం పేరుతో తిడుతూ ఇష్టం వచ్చినట్లు దాడి చేశారు. దీనిపై గాంధారి ఎస్సైకి ఫిర్యాదు చేస్తే తిరిగి వీరిపైన దాడి చేశారని నీపైనే కేసు నమోదు అవుతుంది అంటున్నాడు.' అని తెలిపారు. ఎస్పీ స్పందించి దాడి చేసిన, దాడి చేయించిన వారిపైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని తెలిపారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎరుకల గిరిజన సంఘం అధ్యక్షులు కుర్ర రాములు, ఎరుకల భూమవ్వ, ఎరుకల పెద్ద సాయిలు, ఎరుకల రేణుక, ఎరుకల సాయవ్వ, ఎరుకల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదె మత్యువాత



నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలోని హరిజనవాడ కాలనీలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో గేదె మృత్యువాతపడింది. బాధితుడు మహమ్మద్ ఖాదిర్ తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పొలంలో గేదె మేతమేస్తుండగా విద్యుత్ వైరు తెగి గేదెపై పడడంతో మరణించిందని తెలిపారు. పశు వైద్యాధికారి పంచనామా నిర్వహించి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం తెలియజేశారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరారు.

యువత రక్తదానానికి ముందుకు రావాలి

- రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు
- మెగా రక్తదాన శిబిరానికి ప్రభుత్వ సలహాదారుడికి ఆహ్వానం



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న బాలు

నవతెలంగాణ-కామారెడ్డి

యువత రక్తదానానికి ముందుకు రావాలని రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు అన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం జిల్లా కేంద్రంలోని కర్షక్ బి.ఇడి కళాశాలలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 01 గంటల వరకు నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీని ఆహ్వానించినట్టు ఐఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు రక్తం దొరకకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. వారి ఇబ్బందులను తొలగించడానికి ఈ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంసపత్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ ద్వారా అందజేయడం జరుగుతుందన్నారు. రక్తదానం చేయాలనుకున్న వారు 9492874006 నెంబర్‌కి సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో తలసేమియా సికిల్ సెల్ సొసైటీ నిర్వాహకులు కోటపాటి రత్నావళి, కామారెడ్డి రక్తదాతల సమూహ ప్రధాన కార్యదర్శి గంప ప్రసాద్, కామారెడ్డి జిల్లా రైస్ మిల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పప్పుల రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

పిల్లలకు సమయానికి పౌష్టికాహారాన్ని అందించాలి

- ఆర్‌బిఎస్‌కే టీం డాక్టర్ మనోజ్
- పోషకాహార లోపం ఉన్న పిల్లలకు చికిత్స

నవతెలంగాణ-భిక్కనూర్



నవతెలంగాణ-బోధన్

పిల్లలకు సరైన సమయంలో పౌష్టికాహారాన్ని అందించాలని ఆర్‌బిఎస్‌కే టీం డాక్టర్ మనోజ్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని పల్లె దావఖానాలో పోషకాహార లోపంతో బాధపడుతున్న ఐదు సంవత్సరాలలోపు పిల్లల్ని గుర్తించి డాక్టర్ మనోజ్ అవసరమైన మందులు, సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ వెంకటరమణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శోభ, హెల్త్ సూపర్‌వైజర్ రాజమణి, ఫార్మసిస్ట్ యాద గౌడ్, ఏఎన్ఎం శ్యామల, అంగన్‌వాడీ టీచర్స్ యాదమ్మ, వీణరాణి, వసంత, సంతోషి, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు జీవన భృతి కల్పించాలి

- బిఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు యస్.సిద్దిరాములు



మాట్లాడుతున్న సిద్ధిరాములు

నవతెలంగాణ-కామారెడ్డి

బీడీ కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా 416 జీవన భృతిని ఇవ్వాలని బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సిద్ధిరాములు అన్నారు. బుధవారం బిఎల్‌టియు ఆధ్వర్యంలో పాల్వంచ మండల కేంద్రం బస్టాండ్ నుంచి భారీ ర్యాలీతో బీడీ కార్మికులు తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జయంతిరెడ్డి, ఆర్ఐ విద్యాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం బిఎల్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సైయ్యద్, జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరిరవి, గంగాధర్, బాల్ కిషన్, ఖాదీర్, మల్లయ్య, జీవన్, జగదీష్, టీ,యెల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

'నా ఆటో రక్షితం.. నా ప్యాసింజర్లు సురక్షితం'



మాట్లాడుతున్న డిఎస్పి నాగేశ్వరావు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి ఎస్పీ ఆదేశాల మేరకు "నా ఆటో రక్షితం.. నా ప్యాసింజర్ సురక్షితం" ప్రోగ్రాంను నిర్వహించినట్టు డిఎస్పి నాగేశ్వరావు బుధవారం తెలిపారు. కామారెడ్డి రూరల్ సర్కిల్ పరిధిలోని దేవునిపల్లి, మాచారెడ్డి, రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని ఆటో డ్రైవర్లకు స్థానిక గెలాక్సీ ఫంక్షన్ హాల్‌లో ప్రతి ఆటో డ్రైవర్‌కు ట్రాఫిక్ రూల్స్, ప్రయాణికుల పట్ల వారి బాధ్యత, అదేవిధంగా వ్యక్తిగత ఇన్సూరెన్స్, ఆటో ఇన్సూరెన్స్, చేయకూడనివి, చేయాల్సిన బాధ్యతలపై వివరించారు. ముఖ్యంగా ప్రతి ఆటోకి ఒక క్యూఆర్ కోడ్, వ్యక్తిగత ఇన్సూరెన్స్ రెండు సంవత్సరాల వరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నామని అన్నారు. ఇట్టి విషయమై ఆటో డ్రైవర్లు తమ తమ పోలీస్ స్టేషన్ పరిధిలో వారి పూర్తి వివరాలు, వెహికల్ సంబంధించిన డాక్యుమెంట్స్ ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవనపల్లి ఎస్ఐ రాజు, రామారెడ్డి ఎస్ఐ నరేష్, మూడు మండలాలకు సంబంధించిన సుమారు 150 మంది ఆటోడ్రైవర్లు, పాల్గొన్నారు.

గాంధీ గంజ్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గాంధీ గంజ్‌ను ఎప్పటికపుడు పరిశుభ్రంగా ఉంచాలని, లేనియెడల కఠిన చర్యలు తప్పవని లేబర్ ఇన్చార్జిని మార్కెట్ కమిటీ చైర్మెన్ ముప్ప గంగారెడ్డి హెచ్చరించారు. నిజామాబాద్ నగరంలోని పాత గంజ్‌లో బుధవారం ఉదయం మార్కెట్ కమిటీ చైర్మెన్ ముప్ప గంగారెడ్డి అకస్మిక తనిఖీలతో హడలెత్తించారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా భాధ్యతలు స్వీకరించిన తరువాత కురగాయాల క్రయ విక్రయాలు జరిగే గంజ్‌లో తొలిసారి తనిఖీలు చేపట్టారు. చైర్మెన్ వెంట మార్కెట్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్

కళా ఉత్సవ్ పోటీల్లో సత్తాచాటిన కెటిఎస్ విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

కళా ఉత్సవ్ ముఖ్య సాంస్కృతిక అంశాల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్టు పాఠశాల డైరెక్టర్ విజయ్ కర్నాన్, ప్రిన్సిపాల్ మమ్మద్ మిన్హాజు బుధవారం తెలిపారు. మండల విద్యా వనరుల కేంద్రంలో ఇటీవల పోటీలలో (నాటకం) విభాగంలో విజేతలుగా నిలిచి రోటరీ క్లబ్ అధ్యక్షులు రజనీష్ కిరాడ్ ఎంఈఓ రాజగంగారం చేతుల మీదుగా మెమెంటోను అందుకున్నారు. నేడు జిల్లా కేంద్రంలో జరగబోయే జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులను డైరెక్టర్లు నాగేశ్వర్ రావు, మెహిసిన్ జాబ్రి, అధ్యాపక బృందం అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నూతన ఉపాధ్యాయులకు నియామకపత్రాలు



రెంజల్: నియామకపత్రాలను అందజేస్తున్న నోడల్ అధికారి


ఏర్గట్లలో..


భీంగల్‌లో..

- అందజేసిన ఎంఈవోలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

రెంజల్ : 2024 సంవత్సరం డీఎస్సీలో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు రెంజల్ మండలం నోడల్ అధికారి, ఇంచార్జ్ మండల విద్యాశాఖ అధికారి కట్ట ఆంజనేయులు నియామకపత్రాలను అందజేశారు. రెంజల్ మండలానికి 13 మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా, బుధవారం పదిమంది ఉపాధ్యాయులు వివిధ పాఠశాలల్లో నియామకాలు జరిపినట్లు ఆయన తెలిపారు. వీరన్నగుట్ట ప్రాథమిక పాఠశాలకు ఐదుగురు ఉపాధ్యాయులు, కూనేపల్లి ప్రాథమిక పాఠశాలకు ఒకరు, యుపిఎస్ సాటాపూర్‌కు ఒకరు, జిల్లా పరిషత్ పాఠశాల కందకుర్తికి ఒకరు, జిల్లా పరిషత్ పాఠశాల తాడ్‌బిలోలికి ఒకరు, ప్రభుత్వ పాఠశాల సాటాపూర్‌కు ఒకరు నియామక పత్రాలు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయు మండల అధ్యక్ష కార్యదర్శులు టి.సోమలింగం గౌడ్, కిషోర్ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శంకర్, రఫీ, కూల్ తాహిర్, మండల కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు, మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్గట్ల : రాష్ట్రప్రభుత్వం ఇటీవలే ప్రకటించిన డీఎస్సి ఫలితాల్లో మండలానికి కొత్తగా ఎంపికై వచ్చిన ఉపాధ్యాయులకు ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ ఆనంద్‌రావ్ చేతుల మీదుగా నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి కొత్తగా 5 మంది స్కూల్ అసిస్టెంట్లు, 13 మంది ఎస్జీటీలు వచ్చారని వారికి బుధవారం నియామకపత్రాలను అందజేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణాచారి, సత్యానంద్, కృష్ణప్రసాద్, రాజశేఖర్ తదితరులున్నారు.

భీంగల్ రూరల్ : నూతనంగా ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరినట్టు మండల విద్యాశాఖ అధికారి డి.స్వామి తెలిపారు. మండలానికి కొత్తగా స్కూల్ అసిస్టెంట్లు 12 మంది, ఎస్జీటీలు 32 మంది వచ్చినట్టు వివరించారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు పీఆర్టీయూ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పీఆర్టీయూ అధ్యక్షులు ఎడ్ల శేఖర్, ప్రధాన కార్యదర్శి రాస దయాకర్, కర్నాల శ్రీనివాస్, కాశీరం, ప్రభాకర్, వాసుదేవ్, వినోద్ కుమార్, సుధాకర్, మురళీధర్, రవీందర్, వీఎల్ఎన్ రాధికా, సుమలత తదితరులు పాల్గొన్నారు.

20న పిడిఎస్‌యూ అర్ధశతాబ్ద సభ

- విజయవంతం చేయండి
- జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్



మాట్లాడుతున్న పిడిఎస్‌యు నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 20న జిల్లా కేంద్రంలో న్యూ అంబేద్కర్ భవన్లో జరిగే అర్ధ శతాబ్ద సభను విజయవంతం చేయాలని పి.డి.ఎస్.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం నిజామాబాద్ నగరంలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో పి.డి.ఎస్.యూ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పి.డి.ఎస్.యూ విద్యార్థి సంఘం ఏర్పడి 50 ఏళ్లు కావొస్తుందని, ఎన్నో ఆటుపోట్లు ఎన్నెన్నో అనుభవాలన్నింటిని నిలదొక్కుకొని నేటికి సజీవంగా ఉందని, ఈ 50 ఏళ్ల కాలంలో ఎన్నో సమస్యల పోరాటాలు నిర్మించిందని, ఎన్నో విజయాలు సాధించిందని తెలిపారు. స్కాలర్‌షిప్‌ల కోసం, ఫీజు రియంబర్స్మెంట్ కోసం, హాస్టల్ సౌకర్యాల కోసం ఎన్నో పోరాటాలు చేసి విజయం సాధించిందని వివరించారు. 1974 -2024 వరకు పనిచేసిన పూర్వ పి.డి.ఎస్.యూ నాయకులు, ప్రస్తుతం పనిచేస్తున్న పి.డి.ఎస్.యూ కార్యకర్తలు విద్యార్థులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యూ నాయకులు ప్రిన్స్, మనోజ్, రాహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, హ్యాండ్‌పంపులపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న మిషన్ భగీరథ డీఈ గంగారం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తాగునీరు, హ్యాండ్ పంపులపైన గ్రామ మంచినీటి సహాయకులు అవగాహన కలిగి ఉండాలని మిషన్ భగీరథ డిఈ గంగారం అన్నారు. మండలంలోని అర్గుల్ గ్రామ శివారులో గల మిషన్ భగీరథ కార్యాలయంలో ఆర్మూర్ మండల గ్రామ మంచినీటి సహాయకులకు రెండవ రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండవ రోజు తాగునీరు, హ్యాండ్ పంపుల రిపేరు వాడకం ఏ విధంగా ఉండాలి, హ్యాండ్ పంపు రిపేరు కోసం మెకానిక్ కోసం ఎదురుచూడకుండా గ్రామ మంచినీటి సహాయకులే హ్యాండ్ పంపులు ఏ విధంగా నడిపించాలనే అంశాలపై శిక్షణనిచ్చారు. గ్రామంలో మిషన్ భగీరథ నీటితోపాటు హ్యాండ్ పంపు ద్వారా వచ్చి నీటిని కూడా ప్రజలకు సక్రమంగా అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డిఈ గంగారం, మిషన్ భగీరథ గ్రిడ్ డిఈ శివకుమార్, ఆర్మూర్ ఎంపీడీవో సాయిరాం మిషన్ భగీరథ ఏఈలు మోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, చైన్ మెన్లు రోడ్డ సాయన్న, మధు, మారుతి, రంజిత్, రాజు, ఆర్మూర్ మండలంలోని అన్ని గ్రామాల గ్రామ మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను కలిసిన ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం


వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫీజు రియింబర్స్‌మెంట్ కోసం ప్రైవేటు విద్యాసంస్థలు చేస్తున్న ఉద్యమంలో వారి సహకారాన్ని అందించాలని కోరుతూ నిజామాబాద్ నగరంలోని శ్రావ్య గార్డెన్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు బుధవారం కలిశాయి. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సానుకూలంగా స్పందించారు. తమ పూర్తి మద్ధతు ఉంటుందని తెలిపారు. మూడు రోజులుగా ప్రైవేటు డిగ్రీ పీజీ కళాశాలలు బంద్ పాటిస్తున్నాయని తెలుసుకొని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు విద్యాసంస్థల సమన్వయకర్త నరాల సుధాకర్, సుజన్, బాలకృష్ణ, శ్రీనివాస్, దత్తు, సందేష్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ పోలీస్ స్టేషన్ నుంచి నలుగురు పోలీసుల బదిలీ

- ఎస్సై ఈ.సాయన్న

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పనిచేసిన నలుగురు పోలీస్ కానిస్టేబుల్ బదిలీపై వెళ్ళారని రెంజల్ ఎస్సై ఈ.సాయన్న తెలిపారు. ఇటీవల బదిలీల్లో భాగంగా రెంజల్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీసులు నారాయణ, ఇలియాజ్, ప్రవీణ్ బదిలీ కాగా.. వారి స్థానంలో మరో ముగ్గురు కానిస్టేబుల్ బాధ్యతలు చేపట్టారని, హెడ్ కానిస్టేబుల్ పోస్ట్ ఖాళీగా ఉందని ఆయన పేర్కొన్నారు.

శివాజీ బీడీ యాజమాన్య వైఖరిపై ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

శివాజీ కంపెనీ బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న తునికాకు, పని దినాలు, వేజ్ స్లిప్స్ తదితర సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా నిర్వహించి అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కార్మికులతో ర్యాలీగా వెళ్లి శివాజీ కంపెనీ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ గత కొంతకాలంగా శివాజీ బీడీ కంపెనీ యాజమాన్యం బీడీలు చుట్టే కార్మికులకు నెలలో కేవలం 8 నుండి 12 పనిదినాలు మాత్రమే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల కార్మికులు ఆర్థికంగా నష్టపోతు, కుటుంబాలు గడపడమే కష్టమైపోతుందన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా లేఆఫ్ కొనసాగిస్తూ కార్మికులను నష్టపరుస్తున్నారని ఆరోపించారు. వెంటనే 26 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 1000 బీడీలకు ఇస్తున్న 600 గ్రాముల తునికాకులో 600 బీడీలే తయారవుతున్నాయన్నారు. మిగతా 400 బీడీలకు కార్మికులే బయటకొని తయారు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది చట్ట వ్యతిరేకమైన చర్యని ఆరోపించారు. కార్మికులకు వెయ్యి బీడీలకు సరిపోయేంత తునికాకు తంబాకు, దారం లాంటి ముడి సరుకులు యాజమాన్యమే అందివ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులకు వేతన స్లిప్పులు ఇవ్వకపోవడంతో నెలలో వారికి వేతనం ఎంత వస్తుందో తెలియడం లేదన్నారు. బ్యాంకులో డబ్బులు తెచ్చుకునే సందర్భంలో అయోమయానికి గురవుతున్నారన్నారు. వెంటనే కార్మికులందరికీ వేజ్ స్లిప్స్ అందివ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల విషయమై యాజమాన్యంతో సాయంత్రం వరకు చర్చలు కొనసాగుతున్నాయి. సానుకూల నిర్ణయం రాకపోతే ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.రాజేశ్వర్, ఎం.వెంకన్న, ఐ.ఎఫ్.టీ.యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ముత్తన్న, ఎం.సుధాకర్, యూనియన్ నాయకులు డి.కిషన్, బి.మల్లేష్, సాయన్న, బి.మురళి, మల్లవ్వ, భారతి, లలిత, అమూల్య, సావిత్రి, స్వప్న, జమున, లక్ష్మి, సుధారాణి 600 మంది బీడీ కార్మికులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

మాక్లూర్ కేజీబీవీ ఎస్‌వోను తక్షణమే తొలగించాలి

- ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అత్యంత వివాదాస్పద, అసమర్థ, అవినీతి మాక్లూర్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌ను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయు) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐ.ఎఫ్.టీ.యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ మాట్లాడుతూ మాక్లూర్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ (ఎస్.వో) అనురాధ తన బాధ్యతాయుతమైన విధులకు మాత్రమే గాక, ఉపాధ్యాయ వృత్తికే మాయని మచ్చతెస్తున్నారన్నారు. కేజీబీవీ సిబ్బందిని, టీచర్లను, చివరకు జీఈసీవో , డీఈఓలను కూడా స్కూల్ అసెంబ్లీలో విద్యార్థుల ముందే అనేకసార్లు రాయలేని జుగుప్సాకరమైన బూతుమాటలు తిడుతున్నారన్నారు. సిబ్బందిపై వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. టీచర్లకు అక్రమ సంబంధాలు అంటగడుతున్నారన్నారు. పేరెంట్స్ వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. ఫైన్‌ల పేరుతో విద్యార్థుల నుండి వసూలు చేస్తున్నారన్నారు. వినాయక చవితి పండగ పేరుతో 9, 10 ఇంటర్ విద్యార్థుల దగ్గర నుండి రూ.100చొప్పున వసూలు చేశారన్నారు. స్వయంగా ఎస్‌వో వేలం నిర్వహించి 10వ తరగతి విద్యార్థులతో రూ.4600 లడ్డును వేలం పాడించారన్నారు. వేలం పాట పాడకపోతే ఫెయిల్ అవుతారని బెదిరించారన్నారు. పాఠశాలకు సౌకర్యాలు లేవని ప్రభుత్వం, అధికారులు నిధులు ఇవ్వడం లేదని, కాబట్టి విద్యార్థులే డబ్బులు తీసుకురావాలని ప్రార్థన సమయంలో అసెంబ్లీలో చెప్పిందన్నారు. ఇంటర్ విద్యార్థినులను గ్రూపులుగా తన గదికి పిలిపించుకొని "ఎవరైనా ఆఫీసర్లు వస్తే నేను చెప్పినట్టు విని, అదే చెప్పాలని, చెప్పినట్టు వినకపోతే ఫెయిల్ చేస్తానని ఇంటర్, పదవ తరగతి విద్యార్థులను ఇంటర్నల్ మార్కుల పేరుతో భయపెడుతున్నారన్నారు. అకాడమిక్ విషయాలపై దృష్టి పెట్టకుండా, టీచర్లను సిబ్బందిని గ్రూపులుగా విడదీసి ఒకరిపై ఒకరికి విద్వేషాలు రగిలించారన్నారు. సిబ్బంది, వర్కర్లపై వేధింపులకు పాల్పడుతుందన్నారు. తను చెప్పినట్టుగా ఫేక్ బిల్స్ రాయట్లేదని అకౌంటెంట్‌ను వేధించిందన్నారు. స్కూలు వాట్సాప్ గ్రూప్‌లో టీచర్లను, సిబ్బందిని బెదిరిస్తున్నారన్నారు. ఎస్.వో విధుల్లో చేరినప్పటి నుండి తన ప్రవర్తనతో విద్యార్థులు, టీచర్లు, సిబ్బంది భయా ందోళనలకు గురవుతున్నారన్నారు. ఎస్.వోగా విధుల్లో చేరి రెండు నెలల సమయం కూడా కాకుండానే ఇన్ని అరాచకాలు సృష్టించారని, తక్షణమే ఎస్.వోను విధుల నుండి తొలగించాలన్నారు. లేనిచో వివిధ ప్రజా సంఘాలతో ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లలిత, అమూల్య, ఐ.ఎఫ్.టి.యు జిల్లా అధ్యక్షులు ఎం.ముత్తెన్న, జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజేశ్వర్, ఎం.వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేష్, జిల్లా నాయకులు డి.కిషన్, బి.మురళి, సాయన్న తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై సిఎంకు లేఖ

- సిపిఐ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్, ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు గత ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సిపిఐ బహిరంగ లేఖ రాసింది. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ పక్షాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసినట్టు సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఇంటర్, ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ కళాశాలలో చదివేటటువంటి విద్యార్థులకు గత ప్రభుత్వ హయాంలో 2 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లి ంచ కపోవడంతో యాజమాన్యాల నుండి విద్యార్థులకు అందాల్సిన సర్టిఫికెట్లు విద్యార్థులు తీసుకోలేక భవిష్యత్తు చదువులు చదువుకోలేకపోతున్నారని అన్నారు. విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు కళాశాలలో అవసరమగు లెక్చరర్ల భర్తీ చేయకుండా తరగతి గదులను నడపకపోవుటచేత విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరం నష్టపోవాల్సి వస్తున్నదని కావున ప్రజా పాలన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, చెల్లించిన వెంటనే ప్రస్తుత విద్యా సంవత్సరం సజావుగా జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం, తెలంగాణ యూనివర్సిటీ, ఇంటర్ బోర్డ్ అధికారులపై ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు బి.రమురాం, హనుమాన్లు, ఆనంద్, కుశాల్ పాల్గొన్నారు.



లేఖ విడుదల చేస్తున్న సిపిఐ నాయకులు

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


రెంజల్: పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి గ్రామంలో రెండవ రోజు పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను అందజేసినట్టు పశువైద్యాధికారి డాక్టర్ విట్టల్ పేర్కొన్నారు. 151 తెల్లజాతి పశువులు, 253 నల్ల జాతి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణీ చేశామన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ నాగరత్న, గంగరాజు, సిబ్బంది నరేష్, లక్ష్మణ్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.


జక్రాన్‌పల్లిలో...

జక్రాన్‌పల్లి : పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటాయని మండల పశువైద్యాధికారి శిరీష అన్నారు. మండలంలోని కలిగోట్ గ్రామంలో 840 గేదెలకు, 39 ఆవులకు ఎఫ్ఎండి వ్యాక్సిన్ వేసినట్టు పశు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది అనిల్, గోపాలమిత్రలు రాజ్ కుమార్, పద్మారావు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థికి ఘన సన్మానం

నవతెలంగాణ-బోధన్

2023-2024 సంవత్సరానికి గాను బాసర త్రిబుల్ ఐటీలో సీటు సాధించిన సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీమహికి, ఆమే తండ్రి గానే పాండుకు పాఠశాలలో ఎంఈఓ రాజి మంజూష శాలువాతో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో సాలుర జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ విద్యార్థులు రాబోయే రోజులలో త్రిబుల్ ఐటీలో సీటు సాధించాలని కోరారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధారాణి, శోభారాణి, విజయలక్ష్మి, లక్ష్మి, వనజ, జ్యోత్స్న, అంజన, విజయ్‌కుమార్, సంగీతరావు, స్వామి, రాజ్‌కుమార్, విఠల్ కాంబ్లీ, సంతోష్ యాదవ్ గంధం సాయిలు, అరుణ్ కుమార్, అబ్బయ్య విద్యార్థులు, పాల్గొన్నారు.

ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్షిప్‌లను విడుదల చేయాలి

- ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు

నవతెలంగాణ-బోధన్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో కళాశాలలు నడపలేని పరిస్థితి ఏర్పడిందని, దాంతో వారు కళాశాలలను మూత వేసి నిరవేదిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఈ సమ్మెతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కళాశాలల యాజమాన్యాలతో చర్చించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగ ప్రసాద్, సతీష్, శ్రీను, లోకేష్, మహేష్, కార్తిక్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
నిజామాబాద్-కామారెడ్డి
గురువారం | అక్టోబర్ 17, 2024 | www.navatelangana.com

ప్రయాణికులతో కళ

• మద్నూర్ పాత బస్టాండ్

నవతెలంగాణ-మద్నూర్



పాతబస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయాణికులు

మద్నూర్ పాత బస్టాండ్ ప్రయాణికులతో కళకళలాడుతుంది. దసరా పండుగ కోసం వచ్చిన ప్రజలు మళ్లీ తిరుగు ప్రయాణంతో గత ఐదు ఆరు రోజుల నుంచి బస్టాండు ప్రయాణికులతో కలకలాడుతుంది. ప్రయాణికుల జోరుతో ఆర్టీసీకి ఆదాయం సమకూరుతుంది. మద్నూర్ మండల కేంద్రం నుంచి హైదరాబాద్, నిజామాబాద్, కామారెడ్డి అదేవిధంగా ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరగడం పట్ల మద్నూర్ పాత బస్టాండ్ ప్రయాణికులతో కళకళలాడుతోంది.

కలుపు మందు లాంచింగ్



నవతెలంగాణ-పిట్లం

మండలంలోని ధర్మారం గ్రామంలో ట్రాక్టర్ బ్రాండ్ కంపెనీ ఆధ్వర్యంలో మొక్కజొన్న పంటలో కొత్త కలుపు మందు ప్రోడక్ట్‌ను రైతుల సమక్షంలో లాంచింగ్ చేసినట్టు కంపెనీ ప్రతినిధులు జగదీష్, ప్రాంతీయ మేనేజర్ నరేష్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాక్టర్ బ్రాండ్ కంపెనీ (ఇన్సెక్టి సైడ్స్ ఇండియా లిమిటెడ్) ఆధ్వర్యంలో టోర్రి సూపర్ (ఎస్పీఎఫ్ టెక్నాలజీ) మొక్కజొన్న కలుపు మందును రైతుల సమక్షంలో విడుదల చేసినట్టు వివరించారు. టోర్రి సూపర్ అనే కలుపు మందు ఎకరానికి 600 గ్రాముల చొప్పున వాడాలని రైతులకు సూచించినట్టు పేర్కొన్నారు. టోర్రి సూపర్ కలుపు మందు అన్ని రకాల కలుపు మొక్కలను సమర్థవంతంగా నివారిస్తుందని వివరించారు. అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలు జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సేల్స్ ట్రైనీలు కృష్ణ, మహేందర్, హరికృష్ణ, గ్రామ రైతులు, పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

• డిగ్రీ కళాశాల యూనియన్ ఆధ్వర్యంలో మానవహారం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/ బోధన్





నిజామాబాద్‌సిటీ : నిరసనలో పాల్గొన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నాయకులు బోధన్‌లో..

ప్రైవేట్ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ధర్నాచౌక్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు హరి ప్రసాద్, కో-ఆర్డినేటర్ నరాల సుధాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు మూడేండ్ల నుంచి ఉపకార వేతనాలు రావడంలేదని, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో ఉద్యోగులకు కొన్నినెలల నుంచి జీతభత్యాలు ఇవ్వలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక కారణాలతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కావొద్దనే లక్ష్యంతో ప్రవేశపెట్టి బోధనా రుసుముల చెల్లింపు పథకంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని అన్నారు. విద్యార్థులను ఫీజులు అడగలేక ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు పొందలేక, భవన అద్దె, జీతభత్యాలు, నిర్వహణ వ్యయం భరించలేక, చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక చివరకు మూసి వేస్తున్నట్లు ప్రభుత్వానికి నివేదించే స్థాయికి ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రైవేట్ డిగ్రీ,పీజీ కళాశాలలు పాల్గొన్నారు.

బోధన్ : తెలంగాణ ప్రభుత్వం ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలకు చెల్లించవలసిన ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక సోమవారం నుండి ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలను నిరవధికంగా బంద్ పాటిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా డిగ్రీ కళాశాల యూనియన్ ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషోదయ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి ఆర్‌టిఎఫ్ బకాయిలు రాక కళాశాల నిర్వహణ కష్టంగా మారిందని సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేటు కళాశాలలో నాణ్యమైన విద్యను తక్కువ ఖర్చుతో అందిస్తున్నామని సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నామని అయినా ప్రభుత్వం ప్రైవేటు కళాశాలలపై శీతకన్ను చూపుతోందన్నారు. వీలైనంత తొందరగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తమ ఇబ్బందులను అర్థం చేసుకొని తమను ఆదుకోవాలని వేడుకున్నారు. భవనాల అద్దెలను చెల్లించలేక యజమానులు కళాశాలకు తాళాలు వేసే పరిస్థితి వచ్చిందని ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను చెల్లించలేని స్థితిలో ఉన్నామని పేర్కొన్నారు. విద్యావ్యవస్థను కాపాడుకోవలసిన బాధ్యత ప్రభుత్వాన్నిదే అని త్వరగా స్పందించి బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్‌లు డాక్టర్ గంగాధర్, హరికృష్ణ, అధ్యాపకులు నాగరాజు, శ్రీకాంత్ ,దత్తు, శేఖర్, పవన్, నితిన్, దశరథ్ పాల్గొన్నారు.

19న సిపిఐ(ఎం) మహాసభ

నవతెలంగాణ-మద్నూర్

19న సిపిఐ(ఎం) పార్టీ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ అన్నారు. మండల కేంద్రంలో జరిగిన సిపిఐ(ఎం) జుక్కల్ శాఖ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సిపిఎం గ్రామ శాఖ నుంచి మండల జిల్లా మహాసభ నుంచి జాతీయ మహాసభల వరకు జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలో ప్రజల సమస్యలపైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపైన భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, ఎస్ అజయ్‌కుమార్, గోవింద్, జై.వీరయ్య, షేక్ ఫిర్దోస్, విట్టల్, మోతీరం నాయక్, బి.అడప్ప, టి.సాయిలు, బాలాజీ సాగర్, సిపిఎం పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

దాబా హోటళ్లపై కేసులు నమోదు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై గల పలు దాబాలపై కేసులు నమోదు చేసినట్టు ఎస్సై రాజు తెలిపారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గల వెంగ బాయ్స్, సావేరా దాబా హోటలల్లో మద్యపానం సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వెలువెత్తడంతో ఆ దాబా హోటళ్లలో దాడులు నిర్వహించి హోటల్ యజమానులపై కేసులు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. దాబా హోటల్లో మద్యపానం సిట్టింగ్‌లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి ర్యాంకులు పొందిన నలంద విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ పరిధిలోని మామిడిపల్లి నలంద హైస్కూల్ విద్యార్థులు ఈ అభ్యాస అకాడమీ హైదరాబాద్ సెప్టెంబర్ 26వ తేదీ రోజున రాష్ట్రస్థాయిలో నిర్వహించిన చాణక్య బిజినెస్ అప్టిట్యూడ్ టెస్ట్‌లో నలంద విద్యార్థులు రాష్ట్రస్థాయి మొదటి మూడు ర్యాంకులు సాధించినట్టు పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్‌లు బుధవారం తెలిపారు. 9వ తరగతి బాలాజీ సహస్ర, కీర్తిరెడ్డి, మన్విత, సహస్ర, 8వ తరగతి స్ఫూర్తి, రిశ్వంత్, కార్తికేయ, రిస్వితరెడ్డి, 7వ తరగతి ఆరాధ్య, రాజారెడ్డి, హృదయ శ్రీ, 6వ తరగతి అక్షయ, ప్రీతిరెడ్డి, సంఘం మిత్ర విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా వారికి ఒలంపియాడ్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఒలంపియాడ్ ఇన్చార్జి టీచర్స్ సందీప్, సతీష్, శ్వేతా, అనూష, ఉపాధ్యాయులను విద్యార్థులు వారి తల్లిదండ్రుల సమక్షంలో అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందం పాల్గొని విజయవంతం చేశారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నూతన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. మండలంలో 29 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్టు ఎంఈఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు. కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఎంఈఓ భాస్కర్‌రెడ్డి పలు విషయాలు వారికి వివరించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టుకు ఎంపికైన విద్యార్థులకు సత్కారం

నవతెలంగాణ-లింగంపల్లి

మండలంలోని శెట్టిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన రాష్ట్రస్థాయి కోకో పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం సత్కరించారు. శెట్టిపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాల నుండి 8వ తరగతి విద్యార్థిని మేనక, 10వ తరగతి విద్యార్థిని స్వప్న రాష్ట్రీయ స్థాయి ఖో-ఖో జట్టుకు ఎంపిక కావడం గర్వకారణం. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రసాయన ఇంజనీర్ చంద్రకాంత్‌రెడ్డి అతని తల్లి మాజీ సర్పంచ్ పద్మ గంగారెడ్డితో కలిసి విద్యార్థులను ఘనంగా సత్కరించారు.

లైన్‌మెన్‌కు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చింతలూరు గ్రామంలో పనిచేస్తున్న గ్రామ లైన్‌మెన్ సురేష్ బదిలీపై వెళ్తుండగా సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ శాలువాలతో పూలమాలతో సన్మానించి మెమెంటోను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ యూత్ సభ్యులు, వీడిసి సభ్యులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి పాల్గొని సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు టీకాల ప్రాముఖ్యతను తెలిపారు. మండల పశువైద్య అధికారులు కిరణ్ దేశ్ పాండే, ఉమమ సహెర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మండలంలోని బస్వాపూర్, భిక్కనూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకాన్ని, తరగతి గదులను, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధ్యాయులు ఏ విధంగా విద్యను బోధిస్తున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారానికి రాజీ అవసరం లేదని తెలిపారు.

ప్రాథమిక పాఠశాలలో బెంచీలు వితరణ

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని బంజారా తండాలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలలో ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి విద్యార్థుల కోసం 8 బెంచీలను వితరణ చేసినట్టు మాజీ ఎంపీపీ రాజదాసు తెలిపారు.

పశువులకు గాలికుంటు టీకాలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

పట్టణ కేంద్రంలోని పశువైద్యశాలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు పశువైద్యాధికారి రవికుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నవంబర్ 14 వరకు టీకాల కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. యజమానులు పశువులకు తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు. ఎల్లారెడ్డి పశు వైద్యశాలలో 98 ఆవులకు, 165 గేదెలకు టీకాలు వేశామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి పశువైద్యశాల సహాయ సంచాలకులు సాయిరెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకొని సిద్ధంగా ఉండాలని ఆర్‌డిఓ మన్నే ప్రభాకర్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఆర్డిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పౌరులందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కూడా ఓటు వేయడానికి అర్హులందరూ నవంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బబ్లు, సాయిలు, బిజెపి పార్టీ నాయకులు బాలకిషన్, ఎంఐఎం పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక వసతులు కల్పించాలని హక్కు రక్షణ చట్టం జిల్లా ప్రతినిధి రవీందర్ ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరాను కోరారు. బుధవారం డిపో మేనేజర్‌తో మాట్లాడుతూ.. బస్టాండ్‌లోకి ప్రతి ఒక్క ఆర్టీసీ బస్సు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, మౌలిక వసతులైన తాగునీరు మరుగుదొడ్లు, టాయిలెట్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ లైట్లు, బస్టాండ్ మరమ్మతు పనులు చేపట్టాలని డిపో మేనేజర్‌ని కోరినట్లు తెలిపారు. అనంతరం డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే ఆర్టీసీ బస్టాండ్‌లోని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

రైతుల సమస్యలపై చిత్తశుద్ధి లేని రాష్ట్ర ప్రభుత్వం

• మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఇట్టడి లింగారెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ఇట్టడి లింగారెడ్డి అన్నారు. బుధవారం ఆలూరు మండల కేంద్రంలో మాట్లాడుతూ.. ప్రసుతం వరికోతలు ప్రారంభమైనా ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు వరిధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు అమ్మి నష్టపోతున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి రైతుల సమస్యలపైన చిత్తశుద్ధిలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చెసి రైతులను దళారుల బారి నుంచి కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సోమ ఎర్రన్న, మగ్గిడి నర్సయ్య, గడ్డం భూమారెడ్డి, అకిది శీను, రాంచంద్రపల్లి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏడికి సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

విద్యుత్తు శాఖలో ఏడిగా పనిచేసిన తిరుపతిరెడ్డి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో లింగంపేట ఏడిగా మల్లేశం బుధవారం బాధ్యతలను చేపట్టారు. దీంతో విద్యుత్ శాఖ ఏఈలు సాయినాథ్ హరీష్ రావు ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలదండ వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లైన్మెన్లు ఆదిరెడ్డి, సిబ్బంది తదితరులున్నారు.

గార్విన్ మాసంలో విందు ఏర్పాటు అభినందనీయం

• రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్

నవతెలంగాణ-లింగంపేట్



గార్విన్‌లో పాల్గొన్న షబ్బీర్ అలీ

గార్విన్ మాసంలో అన్ని వర్గాల ప్రజలకు కుల మతాలకు అతీతంగా విందు ఏర్పాటు చేయడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది జలమండలి సభ్యులు మహమ్మద్ మోయినమ్మద్ ఖాద్రి తన ఫామ్ హౌస్‌లో ఏర్పాటు చేసిన గార్విన్ పండుగలు ప్రతి ఏటా నిర్వహిస్తారు. పండుగ వేడుకల్లో భాగంగా ఈ సంవత్సరం ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సంపదలో సగభాగం పేదలకు రాస్తా

హైకోర్టు సీనియర్ న్యాయవాది మొహమ్మద్ మోయినమ్మ ఖాద్రీ

తన సంపదలో సగభాగం పేద ప్రజలకు కుల, మతాల అన్ని వర్గాల ప్రజలకు చేయూతను అందించి సహాయపడతానని రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది, జలమండలి సభ్యులు మహమ్మద్ మోయినమ్మద్ ఖాద్రి అన్నారు. గార్విన్ పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లాలతో పాటు హైదరాబాద్ రంగారెడ్డి దూర ప్రాంతాల నుండి బంధువులు మిత్రులు శ్రేయోభిలాషులు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ అలీ షబ్బీర్‌కు శాలువా కప్పి పూల బోకే అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం అతిథులను ప్రజలను ఆహుతులను అలరించేందుకు ప్రత్యేక కవాలి కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి రెండు గంటల వరకు నిర్వహించారు. కవాలి కార్యక్రమాన్ని ఆసక్తితో తిలకించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలా శ్రీనివాస్, అజ్మీర్ దర్గా రాష్ట్ర ఆర్గనైజర్ ఆజీద్ సయ్యద్ బషీర్ హైమద్, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లస్టర్ల వారిగా సోయా పంట కొనుగోలు

నవతెలంగాణ-మద్నూర్

ఉమ్మడి మండలంలోని మద్నూర్, డోంగ్లి మండలాల పరిధిలో 9 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సోయా పంటకు మద్దతు ధర కల్పిస్తూ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించింది. మద్నూర్ సింగిల్ విండో ఆధ్వర్యంలో మార్క్ఫెడ్ ద్వారా జరుగుతున్న కొనుగోళ్లకు 9 వ్యవసాయ క్లస్టర్ల పరిధిలోని గ్రామాల వారీగా తేదీల ప్రకారంగా సోయా పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని మండల వ్యవసాయ అధికారి రాజు సూచించారు. మద్నూర్ క్లస్టర్‌లో ఈనెల 15 నుంచి 19వ వరకు గ్రామాలు మద్నూర్, వాడే పత్తేపూర్, ఆవలగావ్, మేనూరు క్లస్టర్లో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు గ్రామాలు మేనూర్, మోగా మారేపల్లి, లక్ష్మాపూర్, షేకాపూర్, డోంగ్లి క్లస్టర్‌లో ఈనెల 28 నుంచి 30వ వరకు గ్రామాలు డోంగ్లి, ఇలేగావ్, కొడిచర క్లస్టర్లో నవంబర్ 1 నుంచి నవంబర్ 4 వరకు గ్రామాలు కొడిచరా, సుల్తాన్‌పేట్, లచ్చన్, హాజీపూర్, పెద్దఎక్లారా క్లస్టర్‌లో నవంబర్ 5 నుంచి 9 వరకు గ్రామాలు పెద్దఎక్లార, సోమూర్, రాచూర్, దన్నూర్, రూసేగావ్, పెద్దశక్కర్గ క్లస్టర్లో నవంబర్ 11 నుంచి 14 వరకు గ్రామాలు పెద్దశక్కర్గ, సలబత్పూర్, చిన్న షక్కర్గా, గోజేగావ్, హెచ్ కేలూర్, సోనాల, పెద్దతడుగూర్ క్లస్టర్లో నవంబర్ 16 నుంచి 20 వరకు గ్రామాలు పెద్ద తడుగూర్, చిన్న తడుగూర్, చిన్నఎక్లారా, కరగ్, అంతాపూర్, లింబూర్ క్లస్టర్‌లో నవంబర్ 21 నుంచి 26 వరకు గ్రామాలు లింబూర్, సిర్పూర్, చిమ్మానాపూర్, హసన్‌టాక్లి, పెద్దటాక్లీ, మల్సాపూర్ తడిహిప్పర్గా, కుర్ల క్లస్టర్‌లో నవంబర్ 27 నుండి నవంబర్ 30 వరకు గ్రామాలు కుర్లా, దోతి, ఎనాబోర, మల్లాపూర్, మాదన్ ఇప్పర్గా గ్రామాల వారీగా సోయా పంటను తీసుకురావాలని సూచించారు.

విజయ్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో విజయ్ విద్యార్థినిలు..

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలు మెదక్‌లోని ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 6 నుంచి 8 వరకు మూడు రోజుల పాటు జరిగాయి. రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీలలో అండర్- 17 బాలికల విభాగంలో విజయ్ హై స్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్న సిహెచ్.జాహ్నవి యాదవ్, జె.మధుశ్రీ పాల్గొని తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాలను సాధించారు. ఈ విద్యార్థులను పాఠశాల కార్యదర్శి డాక్టర్ అమృతలత అభినందించారు.

జాతీయస్థాయి కథల పోటీలో..

మాచిరాజు బాలసాహిత్య కళాపీఠం వారి ఆధ్వర్యంలో జాతీయస్థాయి కథల పోటీలు గత నెల 31న నిర్వహించారు. ఈ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 250కి పైగా కథలను విద్యార్థులు రాసి పంపగా, అందులోంచి 20 ఉత్తమ కథలను ఎంపిక చేసి బహుమతిని అందజేశారు. దానిలో భాగంగా విజయ్ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న బి.తనుశ్రీ రాసిన 'కష్టేఫలి' అనే కథకు రూ.300 నగదు, బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రంను నవంబర్ 3న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరిగే బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో అందజేస్తారని పాఠశాల కార్యదర్శి డాక్టర్ అమృతలత తెలియజేశారు.

'భారతీయం' నృత్యోత్సవంలో..

కళాకార్ టీ.వి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2, మహాత్మా గాంధీ 155వ జయంతిని పురస్కరించుకొని 'భారతీయం' అనే నృత్య ప్రదర్శనను తెలంగాణ సారస్వత పరిషత్ నాంపల్లి అక్టోబర్ 2 బుధవారం నిర్వహించారు. వివిధ జిల్లాలలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ నృత్యంలో విజయ్ హై స్కూల్లో తొమ్మిదవ తరగతి చదివే జి.శ్రేష్ఠ, 8వ తరగ చదివే కార్తీక్, 7వ తరగతి చదివే కృతిక, 6వ తరగతి చదివే రిశేష రిథీష, 5వ తరగతి చదివే సమన్విత, 4వ తరగతి చదివే సహర్ష, సాత్విక్, రిహిత, 2వ తరగతి చదివే అద్వైత పాల్గొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ చోటు సంపాదించారని పాఠశాల కార్యదర్శి డాక్టర్ అమృతలత తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రామరెడ్డిని మాజీ చైర్మన్ బోయిని రాధా విటల్ బుధవారం సన్మానించారు. నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట గోపాల్పేట్ కాంగ్రెస్ పార్టీ విలేజ్ ప్రెసిడెంట్ శేఖర్ ఉన్నారు.

ప్రభుత్వ కొలువులు సాధించిన అన్నా చెల్లికి సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్‌లో ప్రభుత్వ కొలువులు సాధించిన గ్రామానికి చెందిన బక్కూరి జానా కృష్ణమూర్తి, మౌనిక అన్న చెల్లెలు బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. 2024 డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో జిల్లాలో ఓపెన్ కేటగిరిలో జానా కృష్ణమూర్తి 55వ ర్యాంక్, మౌనిక 107వ ర్యాంక్ సాధించి ఎస్జీటీ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించారు. కార్యక్రమంలో తమ్మన్న, లింగన్న, శీను, రవి, మురళీ, బక్కన్న, నారాయణ, సంపత్, ముత్తెన్న, అశోక్, శ్రీధర్, సత్యానంద్, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలి

నవతెలంగాణ-ఆర్మూర్

విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండలంలోని చేపూర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చేతనకుమారి అన్నారు. 2024 డీఎస్సీలో ఎస్సే మ్యాస్‌లో ఉపాధ్యాయునిగా జాయిన్ అయినా విక్రమ్‌కు ఈ సందర్భంగా జాయినింగ్ ధృవపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి నుంచి అంకాపూర్ బీటీ రోడ్డుకు నిధులు మంజూరు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మునిపల్లి గ్రామం నుంచి అంకాపూర్ బీటీ రోడ్డు నిర్మాణం కొరకు రూ.3కోట్ల 68 లక్షలు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి మంజూరు చేయించారని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి బుధవారం తెలిపారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు మాట్లాడారు. గత 50 సంవత్సరాలుగా మునిపల్లి నుంచి అంకాపూర్ బీటీ రోడ్డు కొరకు ప్రజలు పడుతున్న కష్టాలకు సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సహకారంతో నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఎమ్మెల్యే పంచాయతీరాజ్ మంత్రి సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, అధ్యక్షుడు కిషన్ నాయక్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు తిరుపతి, మండల బిజెపి సీనియర్ నాయకులు వకీల్ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.